నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 హైదరాబాద్, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 HYDERABAD





ఓయూలో తెలుగు సాహిత్య మహాసభ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వద్దిరాజు రవిచంద్రకు గురువారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

- రామంతాపూర్, ఫిబ్రవరి 15

# తెలుగు సాహిత్య మహాసభ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 15: ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య మహాసభ 2024ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని రూం నెంబర్ 133లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ ఎన్ గోపీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ డాక్టర్ కె. శ్రీనివాస్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ సూర్యాధనంజయ, ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.




బుక్ ఫెయిర్‌లో రవ్వా శ్రీహరి వేదికపై కొత్త తెలంగాణ శాసనాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చరిత్రకారులు డా. దామరాజు సూర్యకుమార్, శ్రీరామోజు హరగోపాల్, జూలూరు గౌరీశంకర్

# శాసనాలే చరిత్రకు శ్వాస

## కొత్త తెలంగాణ శాసనాలు పుస్తకావిష్కరణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 ( నమస్తే తెలంగాణ )/ కవాడిగూడ : తెలంగాణ శాసనాలకు శ్రీరామోజు హరగోపాల్ చిరునామాగా నిలిచారని పలువురు చరిత్రకారులు, రచయితలు కొనియాడారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని రవ్వా శ్రీహరి వేదికపై గురువారం శ్రీరామోజు హరగోపాల్ రచించిన 'కొత్త తెలంగాణ శాసనాలు' గ్రంథాన్ని చరిత్రకారులు డా. దామరాజు సూర్యకుమార్ ఆవిష్కరించారు. చరిత్రకు శాసనాలు ప్రాణప్రదమైన ఆధారాలు అని సూర్యకుమార్ తెలిపారు. శాసనాలు లేకపోతే చరిత్రకు శ్వాస లేదని అన్నారు. అనంతరం పర్యావరణ వేత్త మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ.. శతాబ్ధంలో వెలికి చూడని శాసనాలను రెండు దశాబ్దాలలో హరగోపాల్ వెలుగులోకి తెచ్చే కృషి చేశారని చెప్పారు. అనంతరం డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో శాసనాలు క్రీస్తుకు పూర్వం నుంచే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కో కన్వీనర్ బీవీ భద్రగిరీష్, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, వేముగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం రవ్వా శ్రీహరి వేదికపై ప్రముఖ సాహితీ విమర్శకుడు సంగిశెట్టి శ్రీనివాస్‌తో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, కవి ఉడారి నారాయణ, గుడిపల్లి నిరంరజన్, రాపోలు తదితరులు పాల్గొన్నారు. అదే వేదికపై సీనియర్ జర్నలిస్టు టీవీఆర్ కృష్ణ పరిశోధన చేసిన గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్య సంస్థలు' గ్రంథాన్నీ ప్రముఖ సాహితీవేత్త నరహరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్, డి. చంద్రశేఖర్, జూలూరు గౌరీ శంకర్, ప్రొఫెసర్ రజినీ, రాపోలు తదితరులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'ఈ దేశం మాది' కవితా సంపుటిని బుక్ ఫెయిర్‌లో ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. ఇదిలా ఉంటే కురుగంటి కళా క్షేత్రం బాలలు నృత్య గురు రాధిక ఆధ్వర్యంలో రవ్వా శ్రీహరి వేదికపై చేసిన ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకున్నది. సోలో నృత్య పోటీల్లో మొదటి బహుమతిగా అపూర్వ, రెండో బహుమతి విజేతగా ఆద్య, మూడో విజేతగా నివేదిత, కన్సొలేషన్ బహుమతి అభిజిత గెలుచుకున్నారు. వీరికి హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలురు గౌరీ శంకర్ బహుమతులు ప్రదానం చేశారు.



ఎకో పార్కు ప్రాజెక్టులో ల్యాండ్ స్కేపింగ్ పనులు పూర్తి చేసిన అర్బన్ ఫారెస్ట్రీ విభాగం

ఔటర్ చెంత అద్భుత ప్రాజెక్టు

# ఎకో పార్కు.. నిలిచిపోయింది

## కాంగ్రెస్ హయాంలో కదలని పనులు

### వంద కోట్లు ఖర్చు పెట్టినా కన్నెత్తి చూడని అధికారులు

*దేశంలోనే మొట్టమొదటి వాటర్ టన్నెల్ ఆక్వేరియం... 5 ఎకరాల్లో అతి పెద్ద పక్షిశాల... ఎత్తయిన రాళ్ల గుట్టల మధ్య 2.5 కి.మీ పొడవునా బోర్డు వాక్... ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక అంశాలలో చేపట్టిన ప్రాజెక్టు ఎకో పార్కు. 10, 20 ఎకరాలలో కాదు... ఏకంగా ఒకేచోట 85 ఎకరాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు ఎన్నో ప్రత్యేకతలతో కూడుకున్నది. ఒక వైపు జంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్‌సాగర్, మరో వైపు ఔటర్ రింగు రోడ్డు... ఆ రెండింటి మధ్య సుమారు రూ.300 కోట్ల అంచనాతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చేపట్టిన పర్యాటక ప్రాజెక్టు కొత్వాల్‌గూడ ఎకో పార్కు. గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 100 కోట్ల వరకు వ్యయం చేసి ఈ ప్రాజెక్టు పనులు సుమారు 30 శాతానికి పైగా పూర్తయ్యాయి. దేశ, విదేశాల పర్యాటకులను ఆకట్టుకునేలా ఉన్న ఏకో పార్కు ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. అధికారంలోకి వచ్చి 2 నెలలు గడిచినా ప్రాజెక్టు పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి.*

*- సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ)*

**కేసీఆర్ ప్రభుత్వ హయాంలో** హిమాయత్‌సాగర్, ఔటర్ రింగు రోడ్డు మధ్య ఉన్న 85 ఎకరాల స్థలంలో అద్భుతమైన డిజైన్లతో ల్యాండ్ స్కేపింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ల్యాండ్‌స్కేపింగ్ పనులు అర్బన్ ఫారెస్ట్రీ విభాగం పూర్తి చేయగా, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇతర పనులను చేపట్టారు. ఇందులో ప్రధానంగా బోర్డు వాక్, పక్షిశాల, భారీ టన్నెల్ ఆక్వేరియంకు సంబంధించిన పనులు మొదలు పెట్టారు. ఎత్తయిన కొండలతో కూడిన ప్రాంతంలో అక్కడి సహజ వనరులను ధ్వంసం చేయకుండా నిర్మాణాలను చేపట్టారు. అందులో 2.5 కి.మీ దూరంతో బోర్డు వాక్‌ను నిర్మాణం పనులు ఇప్పటికే పూర్తి చేశారు. అదేవిధంగా అతి పెద్ద పక్షిశాల (ఏవియరీ)కి సంబంధించిన ప్రహరీ పనులు చేపట్టారు. ఎకో పార్కులో 4.27 ఎకరాల స్థలంలో ఆక్వా మైరేన్ పార్కు నిర్మాణం ఉంటుంది. ఈ ఆక్వా మైరేన్ పార్కులో బహుళ సంఖ్యలో టన్నెల్స్‌ను నిర్మించి, అందులో వివిధ రకాల చేపలను ఉంచుతారు. ఇదే ప్రాంతంలో ప్రత్యేకంగా రెస్టారెంటును నిర్మించనున్నారు. అదేవిధంగా డోమ్ థియేటర్, 7డీ థియేటర్, వర్చువల్ అక్వేరియం, టచ్ ట్యాంక్స్, పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంటరాక్టివ్ కియోస్క్‌లు ఉంటాయి. ఒకేసారి 2500 మంది సందర్శకులు వీక్షించేలా 2.50లక్షల చదరపు అడుగు విస్తీర్ణంలో నిర్మాణం ఉంటుంది. వంద మీటరు పొడవుతో వంపు కలిగిన టన్నెల్ 3.5 మీటర్ల వెడల్పుతో నిర్మించి 180 డిగ్రీల కోణంలో గాజు అద్దంలోని నీళ్లలో ఉండే రకరకాలను చేపలను అత్యంత దగ్గర చూసేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఎకో పార్కు నిర్మాణం పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పుల్‌స్టాప్ పెట్టింది. అత్యంత కీలకమైన ప్రాజెక్టుపై హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఇప్పటి వరకు సమీక్ష చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇస్తే తప్ప ఎకో పార్కు ప్రాజెక్టు పనులు మొదలయ్యే పరిస్థితి కనిపించడం లేదు.



2.5 కి.మీ బోర్డు వాక్

# సమతామూర్తి చిట్‌ఫండ్ కేసు.. మరో నిందితుడు అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : సమతామూర్తి చిట్‌పండ్ కేసులో మూడవ ప్రధాన నిందితుడిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ కే.ప్రసాద్ కథనం ప్రకారం.... మంచిర్యాల జిల్లాకు చెందిన ఎల్పుల శ్రీనివాస్(47), అతని కుమారుడు రాకేశ్(27), ఎల్బీనగర్‌కు చెందిన క్యాతం గణేశ్‌తో కలిసి 6 నెలల క్రితం సమతా మూర్తి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. మాదాపూర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో కార్యాలయాలను తెరిచి, రూ.5 లక్షల నుంచి కోటి రూపాయల వరకు చిట్టీలు నిర్వహించారు. మొదటి 3 నెలలు డబ్బులు చెల్లించిన వారికి 4వ నెలలో చిట్టీలను పాడి ఇస్తామని నమ్మబలికారు. ఇలా వందలాది మంది నుంచి సుమారు రూ.5 కోట్ల వరకు వసూలు చేశారు. 4వ నెలలో ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. మాదాపూర్ పోలీసులు కేసును ఈవోడబ్ల్యూకు అప్పగించగా, ఈ నెల 7న ప్రధాన నిందితులైన శ్రీనివాస్, రాకేశ్‌లను అరెస్టు చేశారు. గురువారం మూడవ నిందితుడైన గణేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏసీపీ ఎం.హుస్సేయిని నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# బాలుడిపై లైంగిక దాడి, హత్య

## నిందితుడికి జీవిత ఖైదు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 15 : ఓ బాలుడిపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుడికి స్పెషల్ రాజేంద్రనగర్‌లోని పోక్సో ట్రయల్ కోర్టు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించింది. మైలార్‌దేవ్‌పల్లిలో నివాసం ఉంటున్న సయ్యద్ మునీరుద్దీన్ కుమారుడు 2015 డిసెంబర్ 23న కనిపించడం లేదని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఓ నాలాలో బాలుడి మృతదేహం లభించింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి వట్టెపల్లికి చెందిన సయ్యద్ మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ సోహైల్(45) ఏసీ మెకానిక్. మద్యానికి బానిసైన సోహైల్ 2015 డిసెంబర్ 22న తన ఏసీ పని ముగించుకుని మద్యం సేవించాడు. అక్కడ నుంచి ఆటోలో పురానాపూల్ వెళ్లి గంజాయి సేవించాడు. మత్తులో సుల్తాన్‌పురాలో ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేసి వట్టేపల్లికి చేరుకున్నాడు. ఈ సమయంలో మొగల్స్ కాలనీ లయోలా పాఠశాల ప్రాంతంలో ఓ బాలుడిని చూసిన సోహైల్ లైంగిక దాడి చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ బాలుడిని మసీదు చిరునామా చూపించమని బైక్‌పై తీసుకువెళ్లాడు. రైల్వే ట్రాక్‌పై చీకట్లో లైంగిక దాడి చేసి, అపస్మారకస్థితికి పోయిన బాలుడి తలపై రాయితో దాడి చేశాడు. బాలుడి జననవయాలను కోసి, మృతదేహాన్ని నాలాలో పడేశాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. రాజేంద్రనగర్‌లోని పోక్సో ట్రయల్ కోర్టు నిందితుడు సయ్యద్ మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ సోహైల్‌కు జీవిత ఖైదు, రూ.17 వేల జరిమానా విధించారు.

# పలు ప్రాంతాలలో నేడు నల్లా నీళ్లు బంద్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న సింగూరు ప్రాజెక్టులో భాగంగా పెద్దపూర్ పంప్‌హౌజ్ దగ్గరున్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో టీఎస్ఎస్పీడీసీఎల్ నిర్వహణ పనులు చేపడుతున్నది. ఈ పనులు శుక్రవారం (నేడు) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగుతాయని, ఈ పనులతో పలు ప్రాంతాలలో పాక్షిక, మరికొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. షేక్‌పేట రిజర్వాయర్, భోజగుట్ట (పాక్షిక), బంజారా, ఎర్రగడ్డ రిజర్వాయర్ల ప్రాంతాల్లో (పాక్షిక), బోరబండ రిజర్వాయర్ ప్రాంతాలు (పూర్తిగా), ఖానాపూర్ గ్రావిటీ 1200 ఎంఎం మెయిన్ ఆన్‌లైన్ సప్లయి ప్రాంతాలలో నీటి అంతరాయం ఉంటుందని, ఈ ప్రాంత ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు.



## మాజీ డీజీపీ అంజనీకుమార్ పేరుతో నకిలీ ఇన్‌స్టా ఖాతా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్, మాజీ డీజీపీ అంజనీకుమార్ పేరుతో నకిలీ ఇన్‌స్టా గ్రామ్ ఖాతాను గుర్తుతెలియని వ్యక్తులు తెరవడంతో దీనిపై సీసీఎస్ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేశారు. అంజనీ-కుమార్-1100 పేరుతో ఈ నకిలీ ఖాతాను గుర్తించారు. దీనిపై డీజీ పీఏ హలీమ్ సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని ఏసీపీ చాంద్‌భాషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ మధులత బృందం దర్యాప్తు చేస్తోంది.

# వానకాలం లోపే పూడికతీత పనులు

## రెండోదశ ఎస్ఎన్‌డీపీ పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయండి

## సమీక్షలో జీహెచ్ఎంసీ అధికారులకు దానకిశోర్ ఆదేశాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : వచ్చే వర్షాకాలంలో వరద ముంపు నివారణకు జోనల్ వారీగా పటిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం సీడీఎంఏ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఎన్‌సీ జియావుద్దీన్‌తో కలిసి మాన్‌సూన్ ప్రిపరేషన్‌పై దానకిశోర్ సమీక్షించారు. జీహెచ్ఎంసీ ఏరియాలో వర్షాకాలంలో ముంపునకు గురయ్యే కాలనీల వివరాలు, ప్రభావిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు, అవసరమైన నిధులు కూడా జోన్‌ల వారీగా సిద్ధం చేయాలన్నారు. మ్యాన్‌హోల్స్, క్యాచ్‌పిట్ ఏరియాలో వరదలతో ప్రమాదాలు జరగకుండా ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని చెప్పారు. వానకాలం నాటికి నాలా పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. జీహెచ్ఎంసీకి చుట్టూ పక్కల మున్సిపాలిటీలలో కూడా ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే రెండో దశ ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టేదుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఎన్‌సీని దానకిశోర్ ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ మేజర్ 101, మీడియం 127, మైనర్ 92 కాగా, ఈ పాయింట్‌లను రోడ్‌మ్యాప్ గుర్తించే ఏర్పాటు చేయాలని చెప్పారు. పనికిరాని బోర్‌వెల్స్‌ను గుర్తించాలని, ప్రమాదాలు సంభవించకుండా సైన్‌బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ వాటర్ నాలాలో ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులతో పాటు మెష్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు, ఎస్ఈలు పాల్గొన్నారు.



సీడీఎంఏ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహిస్తున్న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, చిత్రంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, తదితరులు

# రెండు గంటల్లోపే 1930కి కాల్ చేయండి

## సైబర్ క్రైమ్‌లోనూ గోల్డెన్ అవర్ చాలా ముఖ్యం

## జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్



సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): నగరవాసుల నుంచి ప్రతి రోజు సగటున సైబర్ నేరగాళ్లు కోటి రూపాయలు కొట్టేస్తున్నారని హైదరాబాద్ జాయింట్ సీపీ(క్రైమ్స్) ఏవీ రంగనాథ్ తెలిపారు. గురువారం సీసీఎస్‌లో మీడియా ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో సైబర్ నేరాలలో రూ.140 కోట్ల వరకు నష్టపోగా, రూ. 44 కోట్లు ఫ్రీజ్ చేశామని, ఇందులో రూ. 2 కోట్ల లోపే బాధితులకు తిరిగి ఇవ్వగలిగామన్నారు. చదువుకున్న వారే అత్యాశతో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్నారని, తాము మోసపోతున్నామని గుర్తించిన రెండు గంటల్లోపు (గోల్డెన్ అవర్స్) 1930కు కాల్ చేసి సహాయం పొందాలన్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ట్రేడింగ్, కొరియర్ ఫ్రాడ్స్ పెరిగాయన్నారు. క్షేత్ర సాయిలో సమస్యల పరిష్కారానికి త్వరలో బ్యాంకర్లు, సోషల్‌మీడియా నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తామని, సినీ తారల సహాయం కూడా తీసుకుంటామన్నారు. పోలీసుల పేర్లతో ఫోన్లు చేసి, వీడియో కాల్స్‌లోయూనిఫామ్‌లో కనిపిస్తూ ఫేక్ డీపీ వంటివి ఆర్టిఫిషియ్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి ఈ నేరాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు

# నోటిఫికేషన్ జారీ

## ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ

## 28న పరిశీలన, వచ్చే నెల 2న ఉపసంహరణ, 7న ఎన్నికలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్థాయి సంఘం సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయింది. ఏడాది కాల పరిమితితో ఉండే 15 మంది సభ్యుల పదవీ కాలం గత ఏడాది నవంబరులో ముగిసింది. ఎన్నికల కోడ్ కారణంగా ఎన్నిక వాయిదా పడింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ స్టాండింగ్ కమిటీ ఎన్నికను పట్టించుకోలేదు. చివరకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఎన్నిక ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఎట్టకేలకు గురువారం స్టాండింగ్ కమిటీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. శనివారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా..ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు (25వ తేదీ తప్ప) జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఔత్సాహికులు ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించాలని అధికారులు తెలిపారు. ఈ నెల 28వ తేదీన నామినేషన్లను పరిశీలించనున్నారు. వచ్చే నెల 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణ, ఆ తర్వాత అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. పోటీలో 15 మంది కన్నా ఎక్కువ మంది నిలిస్తే 7వ తేదీన జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియను నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని పేర్కొన్నారు.

# వీధి దీపాలను మెరుగుపర్చండి

## కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : వీధి లైట్ల సేవలు మెరుగుపర్చాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశించారు. గురువారం సీడీఎంఏ కార్యాలయంలో ఈఈఎస్ఎల్ ఏజెన్సీ అధికారులతో కమిషనర్ వీధి దీపాల నిర్వహణపై సమీక్షించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాల నిర్వహణలో కార్పొరేటర్లు, ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏజెన్సీని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈఎస్ఎల్ ప్రతినిధులు, ఇంజినీరింగ్ చీఫ్ జియావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.